# కోటి రాణి పార్కులో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు




**హైదరాబాద్, జూన్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బజరంగ్ సేన తెలంగాణ, ఆర్ఎస్ఎస్ మహావీర్ శాఖ, రాణి పార్క్ వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కోటి బ్యాంక్ స్ట్రీట్, రాణి పార్కులో యోగా కార్యక్రమాన్ని నిర్వహించాయి.ఆరోగ్యకరమైన మనస్సు, శరీరం కోసం యోగా ప్రాముఖ్యతను ప్రోత్సహించడానికి ప్రజలు, స్వచ్ఛంద కార్యకర్తలు ఏకమై ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకుడు హన్మంత్ రావు, బజరంగ్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. ఆర్. లక్ష్మణ్ రావు, రాము, మహేష్, కృష్ణ, హనుమంత్ రావు, పాండే, బసవరాజ్, ఇతర ప్రముఖులు యోగా కార్యక్రమంలో పాల్గొని యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవడం యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు.యోగాను ఒక జీవన విధానంగా స్వీకరించి, ఆరోగ్యకరమైన సమాజానికి దోహదపడతామని సామూహిక ప్రతిజ్ఞ చేశారు.

# హైదరాబాద్ వెళ్తున్న ఆర్టిసి బస్సు దగ్ధం..

**- 37 మంది ప్రాణాలు కాపాడిన డ్రైవర్ ప్రశాంత్...**





**కరీంనగర్ టౌన్ జూన్ 21(పిసి డబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ సమీపంలోని కాకతీయ కెనాల్ వద్ద శనివారం కరీంనగర్-2 డిపోకు చెందిన ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులో మంటలు చెలరేగిన ఘటనలో డ్రైవర్ ప్రశాంత్ అప్రమత్తతతో పెను ప్రమాదం తప్పింది. బస్సు వెనుక భాగం నుంచి పొగ వస్తోందని ప్రయాణికులు తెలియజేయడంతో వెంటనే వాహనాన్ని రోడ్డుపక్కన నిలిపి, 37 మంది ప్రయాణికులను సురక్షితంగా కిందకు దించారు. ప్రయాణికులందరూ బయటకు వెళ్లే వరకు బస్సులోనే ఉండి బాధ్యతగా వ్యవహరించిన ప్రశాంత్‌ను స్థానికులు అభినందించారు. అనంతరం బస్సు పూర్తిగా దగ్ధమైనప్పటికీ, ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడం విశేషం. అందరి ప్రాణాలు కాపాడగలిగినందుకు సంతోషంగా ఉందని డ్రైవర్ ప్రశాంత్ తెలిపారు.

# కరీంనగర్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నీట్ పరీక్షలపై అవగాహన కార్యక్రమం

**- విద్యార్థులు తల్లిదండ్రుల సంతకాల సేకరణ**






**కరీంనగర్ టౌన్ జూన్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** నీట్ పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, కరీంనగర్ ఎన్ఎస్‌యూఐ నాయకులు గవర్నమెంట్ ఉమెన్స్ డిగ్రీ కాలేజ్ మరియు కేంద్ర విద్యాలయ పాఠశాల పరీక్షా కేంద్రాల వద్ద అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులను కలిసి నీట్ పరీక్షల నిర్వహణలో చోటుచేసుకున్న లోపాలు, ప్రశ్నాపత్రాల లీకేజీ వంటి కారణాలతో పరీక్షలు రద్దు కావడం వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. భవిష్యత్తులో పరీక్షలను పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలు లేకుండా విజయవంతంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌టీఏకు పంపించనున్న వినతిపత్రంపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించగా, పలువురు విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ముందుకు వచ్చి తమ మద్దతు తెలియజేస్తూ వినతిపత్రంపై సంతకాలు చేశారు. నీట్ వంటి కీలకమైన పరీక్షలను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యుఐ నాయకులు మహమ్మద్ ఇమ్రాన్ చేతన్ రెడ్డి సుఫియాన్ శివరామకృష్ణ అరవింద్ మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# భారత్ యోగ భూమి

**నేటి జీవన శైలి వ్యాధులకు యోగా పరిష్కారం**

**190 దేశాల ప్రజలు యోగా చేస్తున్నారు**

**యోగా మన జీవన విధానం**

**ప్రపంచ శ్రేయస్సుకు యోగాను అనుసంధానం చేసిన ఘనత మోదీదే: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**

**కరీంనగర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రి**

**ప్రతి రోజు దినచర్యలో యోగా భాగం చేసుకోవాలని బండి పిలుపు**

**నీట్ రీఎగ్జామ్ రాస్తున్న విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ చెప్పిన కేంద్ర మంత్రి**









**కరీంనగర్ టౌన్ జూన్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతదేశం "యోగ భూమి"గా ప్రపంచ దేశాలన్ని గుర్తింపు ఇచ్చాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నేడు ప్రపంచమంతా ఒత్తిడి, ఆందోళనతోపాటు జీవన శైలి వ్యాధులతో బాధపడుతున్నారని, వీటికి సరైన పరిష్కారం నిత్యం యోగా చేయడమేనని చెప్పారు. ప్రతిరోజు దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ లో నిర్వహించిన యోగా వేడుకల్లో కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, పలువురు బీజేపీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే...అందరికీ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. యోగా అనేది కేవలం వ్యాయామం కాదు, అది మనిషి శరీరం, మనస్సు, ఆత్మలను ఏకం చేసే జీవన విధానం. మన శరీరం, మనస్సు, ఆలోచనలు, ఆత్మ మధ్య సమన్వయం సాధించడమే యోగా ప్రధాన లక్ష్యం.ప్రపంచంలో ప్రతి దేశానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. కొన్నిదేశాలు టెక్నాలజీకి ప్రసిద్ధి చెందాయి. మరికొన్ని ఆర్థిక శక్తిగా ఎదిగాయి. కానీ భారతదేశానికి ప్రపంచం ఇచ్చిన అత్యున్నత గుర్తింపు ఏమిటంటే భారత్ ఒక "యోగభూమి". యోగా పుట్టింది భారతదేశంలో. ప్రపంచానికి యోగాను అందించింది భారతీయ సంస్కృతి. వేల సంవత్సరాల క్రితం మన ఋషులు ప్రకృతితో మమేకమై జీవిస్తూ ఆరోగ్య రహస్యాలను కనుగొన్నారు. వారు మనకు అందించిన అమూల్యమైన కానుకే యోగా.నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యలైన ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, జీవన శైలి వ్యాధులకు మందుల కంటే ముందు యోగా ఒక సహజ పరిష్కారంగా నిలుస్తోంది. యోగా కోసం ఖరీదైన పరికరాలు అవసరం లేదు. ఎటువంటి పెట్టుబడి అవసరం లేదు. కావాల్సింది కేవలం సంకల్పం మాత్రమే.ప్రతిరోజూ కొద్దిసేపు యోగా చేస్తే శరీరం బలంగా ఉంటుంది. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. ఆలోచనలు స్పష్టంగా ఉంటాయి. పనితీరు మెరుగుపడుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీవితంలో సానుకూలత పెరుగుతుంది. ఇంత మంచి ఫలితాలు ఉన్నాయి కాబట్టే ఇవాళ ప్రపంచవ్యాప్తంగా డాక్టర్లు కూడా యోగాను ప్రోత్సహిస్తున్నారు.కరోనా మహమ్మారి సమయంలో యోగా, ప్రాణాయామం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం ఎంత ముఖ్యమో ప్రపంచమంతా గుర్తించింది. ఈ రోజు మనం యోగాను ఒక రోజు కార్యక్రమంగా కాకుండా, జీవితంలో భాగంగా మార్చుకోవాలి. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు యోగాకు కేటాయిస్తే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించగలం. "యోగ చేస్తే రోగం దూరం" అనే నినాదాన్ని మన జీవితంలో ఆచరణలో పెట్టుకుందాం.ప్రియతమ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో యోగా ప్రపంచవ్యాప్త ఉద్యమంగా మారింది. 2014లో ఐక్యరాజ్యసమితి వేదికపై భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ యోగా దినోత్సవాన్ని ప్రకటించాలని ప్రతిపాదిస్తే కేవలం 90 రోజుల్లోనే 177 దేశాలు ఈ ప్రతిపాదనకు మద్దతు ఇవ్వడం ప్రపంచ చరిత్రలో ఒక విశేషం. ఫలితంగా ఐక్యరాజ్యసమితి జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించింది. నేడు 190కు పైగా దేశాల్లో వందల కోట్ల మంది యోగా చేస్తున్నారు. అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకు, జపాన్ నుంచి బ్రెజిల్ వరకు యోగా ఆరోగ్యానికి మార్గదర్శిగా మారింది. "ఒక భూమి ఒక ఆరోగ్యం కోసం యోగా" వంటి సందేశాల ద్వారా మోదీగారు యోగాను ప్రపంచ శ్రేయస్సుతో అనుసంధానం చేశారు. ఇది భారతదేశానికి గర్వకారణం.ఆరోగ్యానికి యోగా ఒక అద్భుతమైన మార్గం. అందరం ప్రతిరోజూ యోగా చేద్దాం. ఆరోగ్యంగా జీవిద్దాం... భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటుదాం. ఇకపై ప్రతి కుటుంబ దిన చర్యల్లో యోగా ఒక భాగం కావాలని కోరుకుంటున్నా.ఈరోజు నీట్ రీ ఎగ్జామ్. పరీక్ష రాయబోయే విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్. పరీక్షకు ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు జరిగాయి. పరీక్ష రాయబోయే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పొద్దున్నే యోగా కార్యక్రమాలను పూర్తి చేసుకున్నాం.

# మోదీ 12 ఏళ్ల పాలనతో దేశం అభివృద్ధి పథంలో పయనించింది: కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్










**కరీంనగర్ టౌన్ జూన్ 21(పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 సంవత్సరాలుగా దేశం అభివృద్ధి, సుశాసనం, సంక్షేమం మరియు ప్రపంచ స్థాయిలో గుర్తింపు దిశగా గణనీయమైన పురోగతి సాధించిందని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్‌లో శనివారం నిర్వహించిన మేధావుల సదస్సులో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌తో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, "సబ్కా సాథ్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్" అనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. పేదలు, రైతులు, మహిళలు, యువత, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందని తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్, ఉజ్వల యోజన, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్, ఆయుష్మాన్ భారత్ వంటి కార్యక్రమాలు కోట్లాది మంది ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయని పేర్కొన్నారు.ప్రపంచ వేదికపై భారత ప్రతిష్ఠను పెంచడంలో ప్రధాని మోదీ కీలక పాత్ర పోషించారని, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి కార్యక్రమాలు యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించాయని అన్నారు. కరోనా మహమ్మారి సమయంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు దేశ ప్రజల ఆరోగ్య రక్షణలో కీలకంగా నిలిచాయని చెప్పారు.రహదారులు, రైల్వేలు, విమానాశ్రయాలు, స్మార్ట్ సిటీల అభివృద్ధి వంటి మౌలిక వసతుల రంగంలో దేశం వేగంగా ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు.కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కృషితో కరీంనగర్ నగర అభివృద్ధికి అర్బన్ చాలెంజ్ ఫండ్ (యూసీఎఫ్) కింద రూ.840 కోట్ల నిధులు మంజూరయ్యాయని, ఇందుకు ఆయనకు నగర ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మేయర్ అన్నారు."వికసిత్ భారత్2047" లక్ష్య సాధన దిశగా దేశం వేగంగా పయనిస్తోందని, అభివృద్ధి ఫలాలు ప్రతి వర్గానికి చేరేలా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలనకు అభినందనలు తెలియజేస్తూ, దేశ అభివృద్ధి లక్ష్యాలకు ప్రతి భారతీయుడు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, భాష సత్యనారాయణ, సుద్దాల దేవయ్య, డాక్టర్ ఆకుల శైలజ, డాక్టర్ రాజ్‌కుమార్‌తో పాటు ప్రజాప్రతినిధులు, మేధావులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం - ప్రయాణికులను కాపాడిన డ్రైవర్‌కు సన్మానం

### డ్రైవర్‌కు నగదు బహుమతి అందజేసిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

### ధైర్యసాహసాలు ప్రదర్శించిన డ్రైవర్‌ను అభినందించిన వైద్యుల అంజన్ కుమార్







**కరీంనగర్ జిల్లా జూన్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ బస్ డిపో-2 నుంచి బయలుదేరిన ఎలక్ట్రిక్ బస్సులో అగ్నిప్రమాదం సంభవించిన సందర్భంలో, తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రయాణికులను సురక్షితంగా కాపాడిన డ్రైవర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ఘనంగా సన్మానించి నగదు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు కరీంనగర్ కార్పొరేషన్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్, ఆర్టీసీ ఆర్ఎం పిడి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, ఆపద సమయంలో ధైర్యసాహసాలు ప్రదర్శించి డజన్ల కొద్దీ ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన డ్రైవర్ అభినందనీయుడని కొనియాడారు. ఆర్టీసీ సిబ్బంది నిబద్ధతకు, సేవాతత్పరతకు ఇది నిదర్శనమని అన్నారు. ఇలాంటి సిబ్బందిని ప్రోత్సహించడం ద్వారా మరింత మెరుగైన సేవలు అందించేందుకు వారికి స్ఫూర్తినిస్తుందని తెలిపారు.

# వరుణ దేవుని అనుగ్రహం కోసం ప్రత్యేక పూజలు






**రామడుగు జూన్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరుతూ రామడుగు మండలం మోతే గ్రామ ప్రజలు ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు పురుషులు పెద్ద సంఖ్యలో పాల్గొని గ్రామ దేవత పోచమ్మ తల్లికి జలాభిషేకం నిర్వహించారు. అనంతరం గ్రామ శివాలయంలో పరమశివునికి జలాభిషేకం చేసి ప్రత్యేక అర్చనలు చేశారు. అలాగే శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించి వరుణ దేవుని అనుగ్రహంతో సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా భక్తులు గ్రామ శ్రేయస్సు రైతుల సంక్షేమం పంటల సమృద్ధి కోసం దేవతలను వేడుకున్నారు. ఇటీవలి కాలంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామస్థులు సామూహికంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొని పూజలను విజయవంతం చేశారు. వర్షాలు కురిసి చెరువులు కుంటలు నిండాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేసుకునే పరిస్థితులు ఏర్పడాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా ప్రజలు భక్తి భావంతో దేవతలను ప్రార్థించారు.

# పద్మశాలి సేవా సంఘం మరియు యువజన సంఘం ఏకగ్రీవ ఎన్నిక

### పద్మశాలి సేవా సంఘం అధ్యక్షులుగా కొలిపాక మల్లయ్య

### పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులుగా అలువాల విష్ణు



**రామడుగు జూన్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):** రాముడు మండలం గోపాల్ రావు పేట గ్రామంలో పద్మశాలి సేవా సంఘం మరియు యువజన సంఘం ఎన్నికలను సంఘం ఆవరణ లో నిర్వహించడం జరిగింది. ఈ ఎన్నికలను ఎన్నికల అధికారిగా జిల్లా పద్మశాలి నాయకులు లయన్స్ క్లబ్ గవర్నర్ మోర భద్రేశం ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ ఎన్నికలలో పద్మశాలి సేవ సంఘం అధ్యక్షులుగా కొలిపాక మల్లయ్య ఉపాధ్యక్షులుగా కొలిపాక మల్లేశం ప్రధాన కార్యదర్శిగా కొలిపాక కమలాకర్ కార్యనిర్వహక కార్యదర్శిగా రాంపల్లి శ్రీనివాస్ సంయుక్త కార్యదర్శిగా మచ్చ గంగయ్య కోశాధికారిగా సిరిపురం మల్లేశం కార్యవర్గ సభ్యులుగా నల్ల శ్రీనివాస్ కొలిపాక నాగరాజ్ కొలిపాక లక్ష్మణ్ అలువాల శంకర్ ఎన్నిక అయినారు. పద్మశాలి యువజన సంఘం అధ్యక్షులుగా అలువాల విష్ణు ఉపాధ్యక్షులుగా కొలిపాక శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శిగా రుద్ర నాగరాజ్ కార్యనిర్వహక కార్యదర్శిగా మామిడాల నాగరాజ్ సంయుక్త కార్యదర్శిగా అలువాల గంగాధర్ కోశాధికారిగా కొలిపాక ప్రవీణ్ కార్యవర్గ సభ్యులుగా కొలిపాక కమలాకర్ ఎలిగేటి మహేష్ గోనె రమేష్ ఎలిగేటి మహేష్ ఏన్నం రామాంజనేయులు సంఘం ఎన్నిక అయినారు. సలహాదారులుగా సిరిపురం సత్యనారాయణ మచ్చ లచ్చయ్య అలువాల సత్యనారాయణ గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# ఎంపీ డా. కడియం కావ్యకు వేట ఆహ్వాన పత్రికను అందజేసిన ఝాన్సీ రాజేందర్ రెడ్డి.


### • ఈనెల 24న హైదరాబాద్ జూబ్లీహిల్స్ కనెక్షన్ సెంటర్లో వేట కార్యక్రమం ప్రారంభించనున్నారు




**తొర్రూరు ప్రతినిధి, జూన్ 21(పీసీడబ్ల్యు న్యూస్):** ఈనెల 24వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు హైదరాబాదులోని జూబ్లీహిల్స్ కనెక్షన్ సెంటర్లో జరగనున్న వేట ప్రత్యేక కార్యక్రమానికి వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కు ప్రత్యేక ఆహ్వాన పత్రికను అందజేసిన టిపిసిసి ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రాజేందర్ రెడ్డి. మహిళల సాధికారత, అభివృద్ధి మరియు నాయకత్వ వికాసం లక్ష్యంగా అమెరికాలో విజయవంతంగా ప్రారంభమైన ఉమెన్ ఎంపవర్మెంట్ తెలుగు అసోసియేషన్ (వేట) భారతదేశంలో తన కార్యకలాపాలను ప్రారంభిస్తున్న సందర్భంగా ఈ నెల 24వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ కన్వెన్షన్ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని ఝాన్సీ రాజేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమం రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహించబడుతుందని, మహిళలందరూ పాల్గొనాలని వేట ఇండియా ఫౌండర్ మరియు చైర్‌పర్సన్ హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య కు ఆహ్వాన పత్రికను ఝాన్సీ రాజేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా అందజేశారు. మహిళల అభివృద్ధి, సాధికారత కోసం చేపడుతున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఎంపీ కడియం కావ్య ఆకాంక్షించారు. మహిళల సమగ్ర అభివృద్ధికి వేదికగా నిలిచే ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఝాన్సీ రాజేందర్ రెడ్డి మహిళలను కోరారు..

# వెంకటాయపాలెంలో ఘనంగా జయశ్రీ హరీష్ నాయక్ నిశ్చితార్థ వేడుక

### నూతన జంటకు ఆశీస్సులు అందించిన హర్యాతండా ఉపసర్పంచ్ శ్రీను నాయక్ దంపతులు



**రఘునాథపాలెం, జూన్21 (పిసిడబ్ల్యూ న్యూస్):** రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెం గ్రామంలో ఆదివారం జయశ్రీ హరీష్ నాయక్‌ల నిశ్చితార్థ వేడుక కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగింది. సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ కార్యక్రమానికి హర్యాతండా ఉపసర్పంచ్ శ్రీను నాయక్ తన సతీమణి జ్యోతితో కలిసి హాజరై నూతన జంటను ఆశీర్వదించారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాద్, ఆయన సతీమణి శీల తదితరులు పాల్గొని జయశ్రీ హరీష్ నాయక్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన దంపతుల జీవితం ప్రేమ, అనురాగాలతో నిండాలని, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలతో కలకాలం సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని కాబోయే వధూవరులను అభినందించారు.

# ఆదర్శనీయుడు జర్నలిస్ట్ "జానీ భాయ్"

### • నాయకుని అడుగుజాడల్లో... • పుట్టినరోజు వేడుకలకు దూరంగా..



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సీనియర్ జర్నలిస్టు, ఫెడరేషన్ జిల్లా నాయకులు షేక్ జానీ పాషా (జానీ భాయ్) ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకుని అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. సాధారణంగా పుట్టినరోజులను ఆర్భాటంగా జరుపుకునే ఈ రోజుల్లో, జానీ పాషా మాత్రం నిరాడంబరతకు ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక సందేశాన్ని సమాజానికి అందించారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్‌లో సీనియర్ జర్నలిస్టు కూరాకుల గోపి ఆకస్మిక మరణం జర్నలిస్టు కుటుంబాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. గోపి మరణం సహచరుల్లో తీవ్ర విషాదాన్ని నింపగా, ఆ బాధను హృదయంలో మోస్తూనే జానీ భాయ్ తన నిర్ణయాన్ని వెల్లడించారు. ఇటీవల జిల్లా అధ్యక్షుడు సయ్యద్ ఖదీర్ కూడా తన పుట్టినరోజును ఘనంగా జరుపుకోకుండా, వేడుకలకు పూర్తిగా దూరంగా ఉన్నారు. ఆ రోజంతా సేవా కార్యక్రమాలకు మాత్రమే పరిమితమై, సహచరులకు ఒక గొప్ప సందేశం ఇచ్చారు. నాయకత్వం అంటే కేవలం పదవులు కాదు, ఆచరణలో చూపే విలువలేనని సయ్యద్ ఖదీర్ నిరూపించారు. ఆయన చూపిన మార్గం ఫెడరేషన్ నాయకుల్లో కొత్త ఆలోచనలకు దారితీసింది. అదే స్ఫూర్తిని జానీ భాయ్ ముందుకు తీసుకెళ్తున్నారు. జిల్లా అధ్యక్షుడు చూపిన మార్గంలోనే నడుస్తూ, జానీ భాయ్ కూడా తన పుట్టినరోజు వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారు. వ్యక్తిగత సంబరాల కంటే సమాజం పట్ల బాధ్యత ముఖ్యమనే సందేశాన్ని ఆయన ఈ నిర్ణయంతో స్పష్టం చేశారు. పుట్టినరోజు అనేది కేవలం ఆనందానికి మాత్రమే కాదు, మన చుట్టూ ఉన్న వారి పరిస్థితులను గుర్తుచేసుకునే రోజు కూడా కావాలని ఆయన భావిస్తున్నారు. బాధలో ఉన్న సహచరులను గుర్తు చేసుకుంటూ నిరాడంబరంగా ఉండడం గొప్ప మనసుకు నిదర్శనం అని పలువురు అభిప్రాయ పడుతున్నారు. జానీ భాయ్ తీసుకున్న ఈ నిర్ణయం జర్నలిస్టు వర్గాల్లో విశేష చర్చకు దారితీసింది. ఆర్భాటాలకు దూరంగా ఉండి సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం యువ జర్నలిస్టులకు మంచి ఆదర్శంగా నిలుస్తుందని సీనియర్లు చెబుతున్నారు. ఇలాంటి విలువలు, మానవత్వం, సహచరుల పట్ల అనుబంధం ఫెడరేషన్ బలం అని పలువురు జర్నలిస్టులు పేర్కొంటున్నారు. నాయకుల అడుగుజాడల్లో నడుస్తూ జానీ భాయ్ తీసుకున్న ఈ నిర్ణయం మరెందరికో స్ఫూర్తినిస్తూ ఆదర్శంగా నిలిచిపోతుందని అభిప్రాయ పడుతున్నారు.

# ప్రమాద బాధితుడు వేణుగోపాల్ రెడ్డిని పరామర్శించిన మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు



**రామడుగు జూన్ 21(పిసిడబ్ల్యూ న్యూస్):**

రామడుగు మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన కోస్నా వేణుగోపాల్ రెడ్డి ఇటీవల కొత్తపల్లి సమీపంలో జరిగిన మేజర్ రోడ్డు ప్రమాదంలో గాయపడిన నేపథ్యంలో, కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాం రెడ్డి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోచన్న, రామచంద్రం తదితరులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం





**వలిగొండ, జూన్ 21 (పిసిడబ్ల్యూ న్యూస్) :** అంతర్జాతీయ యోగ దినోత్సవ పుష్కర వైభవం పురస్కరించుకుని వలిగొండ మండలంలోని గోకారం గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో యోగ శిక్షకుడు రా ధారపు మల్లేశం ,భారతీయ జనతా పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా మాజీ అధ్యక్షులు శ్రీ పాశం భాస్కర్ గారు ముఖ్య అతిథిగా యోగ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నేటి జీవనశైలిలో యోగ ఒక అంతర్భాగం అని ,
ప్రతి ఒక్కరు తప్పక యోగాన్ని రోజువారి దిన చర్యలో భాగం చేసుకోవాలని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శిక్షార్థులు, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు నాయకులు , ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు బిజెపి మండల పార్టీ అధ్యక్షులు శ్రీ బోళ్ల సుదర్శన్, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి , బిజెపి జిల్లా, మండల నాయకులు బంధారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ, కనతాల అశోక్ రెడ్డి, మై సొల్ల రామ నర్సు, మంద నరసింహ, కందుల తానేష, మండల పదాధికారులు మందుల నాగరాజు, గంగాధరీ దయాకర్, బై రు మల్లేశం, సైదులు రెడ్డి, కట్ట దానయ్య, బూత్ అధ్యక్షులు రమేష్, కృష్ణ, చెరుక దానయ్య, వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

